సాక్షి సూర్యాపేట

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



ఉద్యమాలకు వేదిక

ఉద్యమాల పురిటిగడ్డ హుజూర్‌నగర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. రజాకార్లను తరిమిన చరిత్ర ఈ ప్రాంతానిది. - IIలో



జాగ్రత్తలు పాటించాలి

నామినేషన్ల స్వీకరణలో జాగ్రత్తలు పాటించాలని ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. - IIలో



బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలి

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కోరారు. - IIలో

న్యూస్‌రీల్

రేపు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశం

భానుపురి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నవంబర్ 1న హుజూర్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుదర్శన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సీతారామయ్య ముఖ్యఅతిథులుగా హాజరుకానున్న ఈ సమావేశానికి సభ్యులంతా తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి

తుంగతుర్తి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంపై అధికారులు శ్రద్ధ చూపాలని తుంగతుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా పోలింగ్ కేంద్రాల పరిశీలించి విద్యుత్, తాగునీటి కల్పించడంతోపాటు, వృద్ధులు, మహిళల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యాదగిరిరెడ్డి, డీటీ హరిశ్చంద్రప్రసాద్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.


శివాలయంలో సంప్రదాయ పూజలు



స్ఫటిక లింగానికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. కొండపైన ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన, అభిషేకం చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహహోమం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

స్కూల్‌ను సందర్శించిన విద్యాశాఖ కమిషనర్



విద్యార్థులతో మాట్లాడుతున్న దేవసేన

బీబీనగర్ : మండలంలని కొండమడుగు జిల్లా పరిషత్ పాఠశాలను సోమవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ దేవసేన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. నవంబర్ 3వ తేదీన నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేకు సంబంధించి ప్రశ్నలు అడిగారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ఎంఎన్‌ఓ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి పాత వస్తువులు

నల్లగొండ: నల్లగొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) నల్లగొండలో ఉన్న పాత వస్తువులు (ఇనుము, ప్లాస్టిక్, స్టీల్) మొదలైనవి అమ్మకానికి ఉంచినట్లు మహిళా వికాస కేంద్రం జిల్లా అధికారి ఎ.అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడి వర్మి కంపోస్టు షెడ్‌ను కూడా కిరాయికి ఇస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం వారు మహిళా ప్రాంగణంలో, ఫోన్ నంబర్లను (08682-244416, 7660022517)సంప్రదించాలని పేర్కొన్నారు.

కారు స్పీడు పెంచేలా..

నేడు ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ పర్యటన

- హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలు
- ఏర్పాట్లు చేసిన పార్టీ నాయకులు
- భారీగా జన సమీకరణకు ప్రణాళికలు



హుజూర్‌నగర్‌లో సీఎం ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రచారానికి పదును పెట్టారు. కారు స్పీడు పెంచేలా సుడిగాలి పర్యటనలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రచార సభల్లో పాల్గొన్న ఆయన మంగళవారం మరోమారు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రానున్నారు. హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. ఇందు కోసం పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులు, పార్టీ నేతలు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌ను నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు హుజూర్‌నగర్ చేరుకుంటారు. అక్కడ సభలో ప్రసంగించిన అనంతరం.. మధ్యాహ్నం 2 గంటలకు మిర్యాలగూడకు చేరుకుని సభలో ప్రసంగిస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు దేవరకొండ చేరుకుంటారు. ఇక్కడ సభ ముగిశాక నేరుగా హైదరాబాద్ వెళ్లనున్నారు.

సభలకు భారీ ఏర్పాట్లు..

- హుజూర్‌నగర్ పట్టణం ఫణిగిరి గుట్ట రోడ్డులో 50 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. వేదికకు ఎడమ వైపున హెలిపాడ్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణానికి కుడి వైపు నుంచి జనం రాకపోకలకు ఏర్పాట్లు చేశారు. సభకు 80 వేల మందిని తరలించేలా ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రణాళిక రూపొందించారు. ఒక అదనపు ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 11 మంది ఇన్‌స్పెక్టర్లు, 45 మంది ఎస్‌ఐలు మొత్తం 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణాన్ని సోమవారం ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఎస్పీ రాహుల్ హెగ్డే పరిశీలించారు.
- మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలు నుంచి సుమారు 70 వేలకు పైగా ప్రజలు సభకు రానున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. వర్షం వచ్చినా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ రాక నేపథ్యంలో పట్టణంలో భారీగా కటౌట్లు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ భార్గవ్‌తో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు.
- దేవరకొండలోని ముదిగొండ రోడ్డులో ప్రజా ఆశీర్వాద సభకు ఆ పార్టీ నాయకులు సర్వం సిద్ధం చేశారు. ఈ సభకు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల నుంచి దాదాపు 80వేల మంది తరలివస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆయా మండలాలకు బాధ్యులను నియమించి సభ సక్సెస్ అయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. సోమవారం ఆయన గుత్తా అమిత్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించారు.



దేవరకొండలో సిద్ధమవుతున్న ప్రజా ఆశీర్వాద సభావేదిక



మిర్యాలగూడలో సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన నల్లగొండ ఎస్పీ

నల్లగొండ ఎస్పీ అపూర్వరావు సోమవారం మిర్యాలగూడ, దేవరకొండలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల మళ్లింపు, పార్కింగ్ అంశాలపై సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. మిర్యాలగూడలో నలుగురు డీఎస్పీలు, 15మంది సీఐలు, 50 మంది ఎస్‌ఐలు, 110 మంది ఏఎస్‌ఐలు, మరో 300 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులతో, దేవరకొండలో ఒక ఎస్పీ, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 12 మంది సీఐలతో పాటు ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది మొత్తం కలిపి 530 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బందోబస్తులో విధులు నిర్వహించనున్న పోలీసు సిబ్బందికి ఆమె పలు సూచనలు ఇచ్చారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి



మట్టపల్లిలో సమావేశమైన సూర్యాపేట, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు

- సూర్యాపేట, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు

మఠంపల్లి: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్నిశాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూర్యాపేట, ఏపీలోని పల్నాడు జిల్లాల కలెక్టర్లు వెంకట్రావు, శివశంకర్, ఎస్పీలు రాహుల్‌హెగ్డే, రవిశంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు జిల్లాలోని మఠంపల్లి మండలం మట్టపల్లి వద్దగల నాగార్జున సిమెంట్స్ బైసన్‌బోర్డ్స్ పరిశ్రమ గెస్ట్‌హౌస్‌లో ఇరు రాష్ట్రాల బోర్డర్ జిల్లాల రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, ఫారెస్ట్ ఇన్‌కం టాక్స్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లాలో నిర్వహించిన బోర్డర్ చెక్‌పోస్టుల తనిఖీల్లో రూ.7.50కోట్ల నగదుతోపాటు బంగారం, లిక్కర్, బెల్లం వంటివి సీజ్‌చేశామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో (తెలంగాణలో 5, ఆంధ్రా ప్రాంతంలోని పల్నాడు, ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లాల పరిధిలో మరో ఐదు) మొత్తం పది చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు మరికొన్ని ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇరురాష్ట్రాలతో సంబంధాలు కలిగిన వ్యక్తుల బ్యాంకుల లావాదేవీలపై నిఘా పెడతామన్నారు. చెక్‌పోస్టుల వద్ద ఫ్లయింగ్‌స్క్వాడ్, జీఎస్‌టీ, ఎస్‌జీటీ, వీడియో టీమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అక్రమంగా రవాణా చేసే మద్యం, డబ్బు, బంగారం, ఇతరత్రాలను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసులతో పల్లెనిద్ర కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లఘించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫారెస్ట్ అధికారి సతీష్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, కోదాడ డీఎస్పీ ప్రకాష్, సీఐ రామలింగారెడ్డి, తహసీల్దార్ మంగా, ఎస్‌ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి

- బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సూర్యప్రకాష్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

హుజూర్‌నగర్: బడా కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ నియంతృత్వ పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ నల్లా సూర్యప్రకాష్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల్లో నీళ్లు, నిధులు, నియామకాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిలో ఏ ఒక్కటీ అమలు కాలేదని పేర్కొన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ చేయలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విదేశాలలో ఉన్న నల్లధనం తెచ్చి ప్రతి ఇంటికి రూ.15 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే అన్ని మర్చిపోయిందని ధ్వజమెత్తారు. వివిధ రకాల ధరలు పెంచి పేదలపై భారం మోపిందన్నారు. ఈ ఎన్నికలో ఆయా ప్రభుత్వాలకు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏపూరు సోమన్న, కుంభం సుకన్య, వరికుప్పల వెంకన్న, నజీర్, వస్కుల మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.


రేపటి నుంచి అమరవీరుల సంస్మరణ సభలు



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): భూమి, భుక్తి, వెట్టి బడిదారీ దోపిడీ పాలన విముక్తి కోసం పేదల పక్షాన ప్రాణాలర్పించిన అమరవీరుల సంస్మరణ సభలను నవంబర్ 1నుంచి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవితాంతం రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, చారు మజుందార్, దేవులపల్లి, రాయల సుభాష్ చంద్రబోస్, పైల వాసుదేవరావు, డీవీ కృష్ణ, పొట్ల రామనరసయ్య, ఉమ్మడి జిల్లాకు చెందిన యానాల మల్లారెడ్డి, యానాల చంద్రారెడ్డి, విక్రమన్న, వీరారెడ్డి, జానికిరెడ్డి, అమృతరెడ్డి, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, మారోజు వీరన్న లాంటి వారు ఎందరో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడడమే వాళ్లకు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, ప్రజాపంథా జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నరసయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య రాంజీ, పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోషిమాత, సురేష్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి రెవెన్యూ శివారులోని సర్వేనంబర్ 832 ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం పిల్లలమర్రి గ్రామానికి చెందిన దళితులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలమర్రి గ్రామంలో సుమారు 200 మంది సర్వే నంబర్ 832లో గుడిసెలు వేసుకోగా ఆభూమి మీద కన్నేసిన కొందరు గుడిసెలను తగలబెట్టారని తెలిపారు. గతంలో వారు ప్రభుత్వ భూమిని దొడ్డిదారిన పట్టా పొందారని, ప్రస్తుతం ఆ భూమి ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి భూ సేకరణలో ప్రభుత్వం తీసుకోగా పరిహారం కూడా పొందారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, సీపీఎం పిల్లలమర్రి శాఖ కార్యదర్శి తీగల లింగయ్య,పోకల రవికిరణ్, చెరుకుపల్లి బొందమ్మ, పోకల లక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

విశ్వకర్మ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): నవంబర్ 5న ఉప్పల్ ఆత్మగౌరవ భవన నిర్మాణ స్థలంలో నిర్వహించే తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాజన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని మాతృసంఘం కార్యాలయంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్రోజు గోపి, జిల్లా నాయకులు జనగామ వీరాచారి, మోతె మండల సీతారామాచారి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు బెజ్జంకి ఉపేంద్ర చారి, నూతనకల్ మండల అధ్యక్షుడు పోలోజు వెంకటేశ్వర్లు, నాగారం మండల అధ్యక్షులు పర్వతం శ్రీధర్, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు కడివెంటి సతీష్, సూర్యాపేట కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బైరోజు లింగాచారి, కాసోజు పాండురంగ చారి, జనార్ధన చారి, వెంకటాచారి, కంచర్ల శంకరాచారి పాల్గొన్నారు.

రక్తహీనతను అరికట్టేలా..

- గర్భిణుల ఆరోగ్య రక్షణకు పోషకాహార కిట్లు
- కొనసాగుతున్న తొలి విడత పంపిణీ
- నవంబర్ మొదటి వారం నుంచి రెండో దఫా



కిట్ల వివరాలు..

జిల్లాకు వచ్చిన కిట్ల సంఖ్య	6,034
తొలి విడత పంపిణీ చేసినవి	4,507
పీహెచ్‌సీల్లో నిల్వ ఉన్న కిట్లు	1,527

నాగారం: గర్భిణుల్లో రక్తహీనతను అరికట్టి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చేందుకు ప్రభుత్వం ఆరు నెలల క్రితం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పీహెచ్‌సీల్లో రెండు, మూడో విడతల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న గర్భిణులకు మొదటి విడతగా పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్నారు.

ఆస్పత్రుల వారీగా..

ఓ మహిళ గర్భం దాల్చి 85 రోజుల నుంచి 182 రోజుల లోపు ఉన్న వారికి మొదటి న్యూట్రిషన్ కిట్ అందిస్తున్నారు. ఆ తర్వాత 183 నుంచి 238 రోజుల్లో గర్భిణులు పరీక్షలు చేయించుకునే సమయంలో రెండో కిట్ ఇస్తున్నారు. జిల్లాలోని 3 ఏరియా, 3 సీహెచ్‌సీలు, 24 పీహెచ్‌సీలు, 3 యూపీహెచ్‌సీలతో కలిపి మొత్తం 33 ఆస్పత్రుల్లో కిట్లను పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో తొలుత జూలై నుంచి మొదటి విడత పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. నవంబర్ మొదటి వారం నుంచి జిల్లాలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న గర్భిణులకు రెండో విడత కిట్లను అందజేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధమవుతోంది. మహిళల ఆరోగ్య రక్షణకు పోషకాహార కిట్లను అందజేస్తున్న ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లు ప్రస్తుతం సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో నిల్వ ఉన్నాయి.

కిట్‌లో ఉండే పదార్థాలు– ఉపయోగాలు..

- హార్లిక్స్ : అవసరమైన శక్తి, ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ప్రతిరోజూ పాలు, నీళ్లలో కలుపుకొని తాగాలి. ఇందుకు కప్ కూడా ఉంటుంది.
- ఐరన్ సిరప్ : ప్రతిరోజూ ఐరన్, ఫోలిక్ యాసిడ్ సిరప్ తీసుకోవడం వల్ల గర్భిణుల్లో రక్త హీనతను అదుపు చేయవచ్చు. ప్రసవ సమయంలో తక్కువ బరువు ఉండే శిశువుల జననాలను తగ్గించొచ్చు.
- ఖర్జూరాలు : విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటుంది. వీటిలో ఉండే పోలెట్ గర్భంలో ఉండే బిడ్డ ఎదుగుదలకు దోహదపడతాయి.
- నెయ్యి : ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్–ఏ, ఈ, డీలు ఉంటాయి. తల్లి గర్భంలో ఉన్న బిడ్డకు ఇది పోషణనివ్వడమే కాకుండా చక్కటి శక్తిని ఇస్తుంది.
- పల్లీ చిక్కి : ఇందులో పోషకాలు, యాంటీ యాక్సిడెంట్లు, ఖనిజాలు ఉంటాయి. విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి.
- బాస్కెట్ : కిట్లో ఇచ్చే వస్తువులను అమర్చుకునేందుకు బాస్కెట్ ఇస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులు, వైద్యం అందుబాటులో ఉన్నాయి. గర్భిణుల్లో పోషక విలువలను పెంచేందుకు జిల్లాలోని ఆస్పత్రుల ద్వారా పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్నాం. కిట్లను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి, సూర్యాపేట

కాంగ్రెస్‌లో చేరిన హుజూర్‌నగర్ ఎంపీపీ



హుజూర్‌నగర్ ఎంపీపీ శ్రీనివాస్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ పార్టీలో బీసీ కులాల ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తగిన గౌరవం, గుర్తింపు ఇవ్వనందుకే కాంగ్రెస్ పార్టీలో చేరారని హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించకుండా అవమానిస్తుండడం వల్లే బీఆర్‌ఎస్ పార్టీని వీడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్‌కు తన రాజీనామా పత్రం పంపానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, ఆదెర్ల శ్రీనివాస్‌రెడ్డి, గల్లా వెంకటేశ్వర్లు, వర్మ, గిరిబాబు పాల్గొన్నారు.

ఎరువుల ధరలకు రెక్కలు

- ఇటీవలే రేట్లు పెంచిన కంపెనీలు
- పెరిగిన ధరలు వెంటనే అమలులోకి..
- అన్నదాతలపై తప్పని పెనుభారం



ధరలు ఇలా (బస్తాకు రూ.లలో)..

ఎరువు రకం	పాత ధర	కొత్త ధర
14-35-14	1,500	1,600
28-28-0	1,500	1,600
24-24-0	1,500	1,600
ఎస్ఎస్‌పీ	500	600

నాగారం: యాసంగి సీజన్ ప్రారంభంలోనే రైతన్నలకు చేదు కబురు వినబడింది. కంపెనీలు ఎరువుల ధరలు పెంచుతూ ఇటీవల తీసుకున్న నిర్ణయం అన్నదాతలకు పెనుభారంగా మారనుంది. ఇప్పటికే కొన్ని రకాల ఎరువుల ధరలు పెంచిన కంపెనీలు ఈనెల 28 నుంచి ఇంకొన్ని ఎరువుల ధరలను పెంచి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఇక నుంచి రాబోయే కొత్త నిల్వలన్నింటికీ పెరిగిన ధరలే వర్తిస్తాయని సంబంధిత కంపెనీలు జిల్లాలోని డీలర్లకు సమాచారం ఇచ్చాయి. దీంతో పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయి. ప్రతి బస్తాకు రూ.100 వరకు ఒక్కసారిగా పెరగడం అన్నదాతలకు ఇబ్బంది కలిగించే విషయంగా ఉంది. యాసంగి సీజన్‌లో జిల్లాలోని రైతులపై రూ.కోట్లాది భారం పడనుంది. దీంతో సేద్యం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ముడి సరకు ధరలు పెరగడంతోనే..

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్బీఎస్ (న్యూట్రిషన్ బేస్డ్ సబ్సిడీ) పోషకాధారిత రాయితీ నిధులను ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి కేటాయించింది. అంతర్జాతీయ విపణిలో ముడి సరుకుల ధరలు పెరిగాయి. దీంతో తయారీ ఖర్చులు భారమై ఎరువుల ధరలు పెంచక తప్పడం లేదని పలు కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

ఆ మూడు మాత్రమే పాత ధరలకు..

మూడు రకాల ఎరువులపై మాత్రం ధరలు పెరగలేదు. 20-20-0-13 రూ.1200, డీఏపీ రూ.1350, 10-26-28 రూ.1470 చొప్పున పాత ధరలకే విక్రయిస్తారు. కొన్ని రకాల ఎరువుల ధరలు పెరిగినప్పటికీ రిటైల్ డీలర్ల షాపుల్లో ఉన్న పాత నిల్వలను పాత ధరలకే విక్రయించాల్సి ఉంటుంది.

ఉద్యమాల వేదిక

- రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర హుజూర్‌నగర్ ప్రాంతానిది
- 1972 తర్వాత రద్దయి.. 2009లో నియోజకవర్గంగా ఏర్పాటు
- మొదట్లో కమ్యూనిస్టుల ఆధిపత్యం..
- పునర్విభజన తర్వాత కాంగ్రెస్‌దే పైచేయి

అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్




మగ్దూం మోహినుద్దీన్


దొడ్డా నర్సయ్య


ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి


శానంపూడి సైదిరెడ్డి


కీసర జితేందర్‌రెడ్డి


అక్కిరాజు వాసుదేవరావు

హుజూర్‌నగర్: ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన హుజూర్‌నగర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర ఈ ప్రాంతానిది. 1952లో హుజూర్‌నగర్ ద్విసభ నియోజకవర్గంగా ఉండేది. 1972 తర్వాత ఈ నియోజకవర్గం రద్దయింది. ఈ కాలంలో ఇక్కడ ఎక్కువగా కమ్యూనిస్టుల ఆధిపత్యం ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో తిరిగి హుజూర్‌నగర్ నియోజకవర్గం ఏర్పాటైంది. అప్పటి నుంచి కాంగ్రెస్ ఎక్కువసార్లు గెలుపొందింది. 2019లో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ విజయం సాధించింది.

అత్యధిక సిమెంట్ పరిశ్రమలు..

దేశంలోనే అత్యధికంగా సిమెంట్ పరిశ్రమలు గల నియోజకవర్గంగా హుజూర్‌నగర్ ప్రసిద్ధి కెక్కింది. ఇక్కడ కృష్ణానది వెంట సున్నపురాతి గనులు ఉండటంతో 11 సిమెంట్ పరిశ్రమలను నెలకొల్పారు. అంతే కాకుండా ఈ నాపరాయి (స్టోన్ క్రషర్) పాలీష్, బైసన్ బోర్డ్స్ పరిశ్రమలు ఉన్నాయి. నియోజకవర్గం ఎక్కువ భాగం సాగర్ ఆయకట్టు కింద ఉంది. ఇక్కడి రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తారు. నాన్ ఆయకట్టులో పత్తి, మిరప సాగు చేస్తారు. ఇక్కడ రైస్ మిల్లులు కూడా అధికంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన వ్యవసాయ పరిశోధనా కేంద్రం (కృషి విజ్ఞాన కేంద్రం) ఈ నియోజకవర్గంలోనే ఉంది.

సర్వమతాలకు నెలవు..

నియోజకవర్గంలో మూడు మతాలకు సంబంధించిన అధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. మట్టపల్లిలో ప్రసిద్ధ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, మేళ్లచెరువులో శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయం ఉన్నాయి. అన్ని మతాలవారు ఆరాధించే జాన్‌పహాడ్ దర్గా, క్రైస్తవుల ఆధ్యాత్మిక కేంద్రంగా మఠంపల్లిలో అతిపెద్ద శుభవార్త చర్చి ఉన్నాయి.

మంత్రులుగా ఇద్దరు..

హుజూర్‌నగర్ (పాత, కొత్త) నియోజకవర్గం నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు రాష్ట్ర మంత్రులుగా పనిచేశారు. 1962 నుండి 1972 వరకు రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన అక్కిరాజు వాసుదేవరావు కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నర్సింహారావు కేబినెట్‌లలో సమాచార, ప్రసారాలు, చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అప్పటి (ఉమ్మడి రాష్ట్ర చివరి) సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో గృహనిర్మాణ శాఖమంత్రిగా పనిచేశారు.

నియోజకవర్గంలో మండలాలు..

హుజూర్‌నగర్ నియోజకవర్గం హుజూర్‌నగర్, మేళ్లచెరువు, మఠంపల్లి, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలతో తొలుత ఏర్పడింది. కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా మేళ్లచెరువు మండలం నుంచి చింతలపాలెం, నేరేడుచర్ల మండలం నుంచి పాలకవీడు మండలాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఏడు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రమైన హుజూర్‌నగర్‌తో పాటు నేరేడుచర్ల మున్సిపాలిటీలుగా ఉన్నాయి.

హుజూర్‌నగర్‌లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1952 (ద్వి.)	టి.నర్సింహులు	పీడీఎఫ్	సుమిత్రాదేవి	కాంగ్రెస్
1952 (ద్వి.)	జయసూర్య	పీడీఎఫ్	కెఎల్‌ఎన్.రావు	కాంగ్రెస్
1952 (ఉ.ఎ.)	ఎం. మోహినుద్దీన్	పీడీఎఫ్	జీఎస్.రెడ్డి	కాంగ్రెస్
1957	దొడ్డా నర్సయ్య	పీడీఎఫ్	జవి.రావు	కాంగ్రెస్
1962	అక్కిరాజు వాసుదేవరావు	కాంగ్రెస్	దొడ్డా నర్సయ్య	సీపీఐ
1967	అక్కిరాజు వాసుదేవరావు	కాంగ్రెస్	దొడ్డా నర్సయ్య	సీపీఐ
1972	కీసర జితేందర్‌రెడ్డి	ఇండిపెండెంట్	వాసుదేవరావు	కాంగ్రెస్
2009	ఉత్తమ్ కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	జి.జగదీష్‌రెడ్డి	టీఆర్‌ఎస్
2014	ఉత్తమ్ కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	కాసోజు శంకరమ్మ	టీఆర్‌ఎస్
2018	ఉత్తమ్ కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	శానంపూడి సైదిరెడ్డి	టీఆర్‌ఎస్
2019 (ఉ.ఎ.)	శానంపూడి సైదిరెడ్డి	టీఆర్‌ఎస్	పద్మావతి	కాంగ్రెస్

రూ.3లక్షల నగదు పట్టివేత

చండూరు: హాలియా మండలానికి చెందిన కొందరు వ్యక్తులు వాహనంలో తరలిస్తున్న రూ.3లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్‌ఎస్‌టీ) సోమవారం చండూరు మండలంలోని ఉడతలపల్లి గ్రామ శివారులో పట్టుకున్నారు. సదరు వ్యక్తులు పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

నెల రోజుల మంత్రి


వీరేపల్లి లక్ష్మీనారాయణ

కోదాడ: కోదాడ నియోజకవర్గం నుంచి 1983లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసిన వీరేపల్లి లక్ష్మీనారాయణ సమీప కాంగ్రెస్ అభ్యర్థి చింతా చంద్రారెడ్డిపై 1250 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాగా 1984లో నాదెండ్ల భాస్కర్‌రావు ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చి ముఖ్యమంత్రి పీఠం ఎక్కగా.. లక్ష్మీనారాయణ నాదెండ్ల భాస్కర్‌రావు వైపు నిలిచి ఆయన మంత్రి వర్గంలో భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా నెల రోజుల పాటు పనిచేశారు. ఆ తర్వాత 1985లో జరిగిన ఎన్నికల్లో లక్ష్మీనారాయణ పోటీ చేయలేదు. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి వేనేపల్లి చందర్‌రావు చేతిలో 3800 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు లక్ష్మీనారాయణ దూరంగా ఉంటున్నారు.

మునుగోడు, హుజూర్‌నగర్ బీఎస్పీ అభ్యర్థులు ఖరారు

నల్లగొండ: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) మునుగోడు, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభ్యర్థులను సోమవారం ప్రకటించింది. మునుగోడు నియోజకవర్గానికి అందోజు శంకరాచారి, హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రాపోలు నవీన్ అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది.

అక్కడా.. ఇక్కడా విజయం వారిదే

- స్థానం మారినా దక్కిన గెలుపు
- స్థానికతతో సంబంధం లేకుండా పట్టం కట్టిన ఓటర్లు
- మూడు చోట్లా ధర్మభిక్షం విజయం
- రెండుసార్లు కోదాడలో.. మూడుసార్లు హుజూర్‌నగర్‌లో గెలిచిన ఉత్తమ్
- నాగార్జునసాగర్‌లో జానాను ఓడించిన నోముల



(నల్లగొండ డెస్క్)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొంత మంది నేతలకు ప్రత్యేక స్థానం ఉంది. ఎమ్మెల్యేగా ఒకసారి ఒక దగ్గర గెలిచిన వీరు తరువాత ఎన్నికల్లో వివిధ కారణాలతో మరోచోటికి మారి అక్కడ కూడా జయకేతనం ఎగురవేశారు. స్థానం మారినా.. విజయం మాత్రం వారినే వరించింది. జిల్లాలో ఎనిమిది మంది నేతలు ఇలా రెండు, అంతకు మించిన స్థానాల్లో విజయం సాధించారు. అభ్యర్థి స్థానికతతో సంబంధం లేకుండానే ఓటర్లు వీరికి పట్టం కట్టారు.

తుంగతుర్తి, సూర్యాపేటలో.. దామోదర్‌రెడ్డి



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి 1985, 1989 ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి సీపీఎం అభ్యర్థి మల్లు స్వరాజ్యంపై, 1994లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి సీపీఎం అభ్యర్థి బుచ్చిరాములుపై, 2004లో తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఎస్.వెంకటేశ్వరరావుపై గెలుపొందారు. ఆ తరువాత ఆయన సూర్యాపేట స్థానానికి మారి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీఆర్‌ఎస్ అభ్యర్థి పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై విజయం సాధించారు.

బొమ్మగాని ధర్మభిక్షం.. మూడు చోట్ల



సీపీఐ సీనియర్ నేత బొమ్మగాని ధర్మభిక్షం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు చోట్ల పోటీ చేసి ప్రతీ చోటా విజయం సాధించారు. ఆయన నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. సూర్యాపేట ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న సమయంలో 1952 ఎన్నికల్లో ధర్మభిక్షం పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి జీవి రెడ్డి మీద విజయం సాధించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో నకిరేకల్ అసెంబ్లీ స్థానం నుంచి ఆయన పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కెవిరావుపై విజయం సాధించారు. 1962లో ఆయన నల్లగొండ నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ రవూఫ్‌పై విజయం సాధించారు.

చిన్నకొండూరు, భువనగిరి నుంచి బాపూజీ



1957 అసెంబ్లీ ఎన్నికల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిన్నకొండూరు(మునుగోడు) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పీడీఎఫ్ అభ్యర్థి కె.వెంకట్రామారావుపై విజయం సాధించారు. ఆ తర్వాత 1965 ఉప ఎన్నికల్లో మరోసారి ఇక్కడి నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి సీపీఐ అభ్యర్థి జెఎం.రెడ్డిపై విజయం సాధించారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన భువనగిరి నుంచి పోటీ చేసి సీపీఐ అభ్యర్థి ఏ.రామచంద్రారెడ్డిపై, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి సీపీఎం అభ్యర్థి కె.రామచంద్రారెడ్డిపై విజయం సాధించారు.

కోదాడ, హుజూర్‌నగర్‌లో.. ఉత్తమ్



కాంగ్రెస్ పార్టీ నుంచి కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా తొలిసారి 1994లో పోటీ చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేనేపల్లి చందర్‌రావు చేతిలో ఓటమి పాలయ్యారు. కానీ 1999, 2004 ఎన్నికల్లో అదే చందర్‌రావుపై విజయం సాధించారు. ఆ తరువాత 2009 ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజనతో కొత్తగా ఏర్పడిన హుజూర్‌నగర్ నియోజకవర్గానికి మారారు. ఆ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన జగదీష్‌రెడ్డిని, 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి శంకరమ్మను, 2018 ఎన్నికల్లో సైదిరెడ్డిని ఓడించి వరుసగా మూడుసార్లు హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో మళ్లీ ఆయనే కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.

ఆలేరు, తుంగతుర్తిలో.. మోత్కుపల్లి



మోత్కుపల్లి నర్సింహులు ఆలేరు నుంచి వరుసగా ఐదు సార్లు విజయం సాధించారు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోచయ్యపై, 1985లో కాంగ్రెస్ అభ్యర్థి సి.కెన్నడిపై, 1989లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి సున్నం యాదగిరిపై, 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కుడుదుల నగేష్‌పై విజయం సాధించారు. 2009లో తుంగతుర్తి నుంచి టీడీపీ తరఫున కాంగ్రెస్ అభ్యర్థి జి.నర్సయ్యపై గెలుపొందారు.

రెండు చోట్ల అక్కిరాజు..



కోదాడ నియోజకవర్గం ఏర్పడక ముందు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 1962, 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అక్కిరాజు వాసుదేవరావు వామపక్షాల అభ్యర్థి దొడ్డా నర్సయ్యపై విజయం సాధించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 1978లో కోదాడ నియోజకవర్గం ఏర్పడింది. ఈ ఎన్నికల్లో అక్కిరాజు వాసుదేవరావు జనతాపార్టీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కె.లక్ష్మణరాజుపై విజయం సాధించారు.

సీపీఎం నుంచి భీంరెడ్డి



సీపీఎం సీనియర్ నాయకుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి 1957లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆర్ఆర్.రావుపై విజయం సాధించారు. ఆ తరువాత ఆయన 1967లో తుంగతుర్తి నియోజవకర్గం నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వి.నర్సింహారెడ్డిపై విజయం సాధించారు.

నకిరేకల్, సాగర్‌లో.. నోముల



సీపీఎం సీనియర్ నేతగా ఉన్న నోముల నర్సింహయ్య 1999, 2004లో అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి కటికం సత్యయ్యగౌడ్‌పై విజయం సాధించారు. ఆ తరువాత ఆయన టీఆర్‌ఎస్‌లో చేసి 2018 ఎన్నికల్లో నాగార్జున సాగర్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి జానారెడ్డిపై విజయం సాధించారు.

నామినేషన్ల స్వీకరణలో జాగ్రత్తలు పాటించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నల్లగొండ కలెక్టర్, ఎస్పీ, అధికారులు

నల్లగొండ: నామినేషన్ల స్వీకరణకు తగిన ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ వివరాలు ఎన్‌కోర్‌లో అప్‌డేట్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. సోమవారం ఆయన నుంచి ఢిల్లీ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సీ–విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు తెలంగాణలో 1745 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని, కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు సీ–విజిల్ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. నామినేషన్ల సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలు, అనుమతులు, ఎక్స్‌పెండీచర్ ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్ ఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. ఓటరు స్లిప్పులు, ఓటర్ గుర్తింపు కార్డుల పంపిణీపై జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. స్ట్రాంగ్‌రూంలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఫైనలైజేషన్, పోలింగ్, సెక్టోరల్ అధికారులకు అవసరమైన బందోబస్తు, పోలింగ్ స్టేషన్ల నిర్ధారణ, పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి వాటిపై పలు సూచనలు చేశారు. సభలు, సమావేశాలకు సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందేందుకు రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. అన్ని పార్టీల అభ్యర్థులకు ఎన్నికల సంఘం రూపొందించిన నిర్దేశిత సమయాలను తెలియజేయాలని, అనంతరం నల్లగొండ ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ.. అక్రమంగా తరలించే మద్యం, నగదు, ఇతర వస్తువులను సీజ్ చేస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ కలెక్టర్ హరిసింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నకిరేకల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నాగార్జున, రిటర్నింగ్ అధికారులు జె.శ్రీనివాస్, రవి, చెన్నయ్య, శ్రీరాములు, దామోదర రావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు అందరూ సహకరించాలి

- భువనగిరి ఆర్డీఓ అమరేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అమరేందర్

భువనగిరిటౌన్ : ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని భువనగిరి ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అమరేందర్ కోరారు. భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో నామినేషన్ ప్రక్రియ సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ధ్రువపత్రాల జత చేసే విధానంపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం నవంబర్ నెలలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ప్రకటన వెలువరించిన దృష్ట్యా జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని, 10వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. 13న స్క్రూటినీ జరుగుతుందని ,15న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. నవంబర్ 30న పోలింగ్ జరుగుతుందని, డిసెంబర్ 3న ఫలితాలు వెలువడుతాయని వివరించారు. దివ్యాంగులు, 80 సంవత్సరాల వయస్సు దాటిన వారికి పోస్టర్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేసామని తెలిపారు. భువనగిరి అసెంబ్లీ పరిధిలో ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓటర్లు ముందస్తుగా వారి ఓటును ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారి ఉపేందర్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు


గోపికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న రవి

మునుగోడు: తనకు దొరికిన సెల్ ఫోన్‌ని పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించి ఓ యువకుడు నిజాయితీ చాటుకున్నాడు. ఖమ్మం జిల్లాకు చెందిన గోపి ఈ నెల 26న మునుగోడులో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభా ఏర్పాట్లు చేసేందుకు కూలీ పనికి వచ్చాడు. ఈ క్రమంలో రూ.25వేల విలువ గల తన సెల్ ఫోన్ పొగొట్టుకున్నాడు. ఆ ఫోన్ దొరికిన మునుగోడుకు చెందిన రవికి దొరికింది. అయితే, గోపి ఇంటికి వెళ్లాక తన సెల్‌కు కాల్ చేశాడు. ఫోన్ తనకే దొరికిందని సోమవారం మునుగోడుకు వచ్చిన గోపికి సెల్‌ఫోన్ అప్పగించాడు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలి

- రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి


ఓటరు చైతన్య యాత్రలో పాల్గొన్న మురళి

నల్లగొండ : వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. సోమవారం జాగో తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య యాత్రను నల్లగొండలో సాగింది. ఈ సందర్భంగా ఎన్జీకాలేజి, గడియారం కూడళ్లలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ఓటేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ నాశనమైందన్నారు. విద్యకు దేశంలోనే అతి తక్కువ బడ్జెట్ కేటాయిస్తుంది తెలంగాణలోనే అని తెలిపారు. వీసీ పోస్టుల భర్తీ చేయలేదని, 74శాతం యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తే ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోయినా ప్రైవేటు రంగంలో ఉపాధి పొందుతారని చెప్పినా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు భూమి, ఇతర మౌలిక వసతులు కల్పిస్తుందని, అలాంటప్పుడు ఆ కంపెనీల్లో 70 శాతం ఉద్యోగాలు రాష్ట్ర యువతకే ఇవ్వాలని నిబంధన పెడితే నిరుద్యోగ సమస్య ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వైద్య రంగానికి 4 శాతం బడ్జెట్ కేటాయిస్తున్నారని దాన్ని 8 శాతానికి పెంచితే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించవచ్చన్నారు. ఇంటికో ఉద్యోగం అంతా ఉత్తి మాటే అన్నారు. బీజేపీ ప్రభుత్వం సంపదనంతా అంబానీ, అదానిలకు దోచి పెడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో జాగో తెలంగాణ నాయకులు చలపతిరావు, ప్రదీప్, అన్వేష్, సాగర్, గోవర్ధన్, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు

బొమ్మలరామారం : వివాహితను మానసికంగా, శారీరకంగా వేధించిన కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ భువనగిరి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పునిచ్చారు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మలరామారం మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన రాంపల్లి భిక్షపతికి ఇద్దరు భార్యలు. (నిందితుడి కుటుంబం ప్రస్తుతం కుషాయిగూడలో నివాసం ఉంటోంది). వీరిలో రెండవ భార్య రాంపల్లి ధనమ్మ తన భర్త రాంపల్లి భిక్షపతితో పాటు మొదటి భార్య రాంపల్లి భాగ్యమ్మ, వారి కుమారుడు రాంపల్లి మహేష్‌లు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని 2015 సంవత్సరం అక్టోబర్ 5న బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ నర్సింహారావు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం భువనగిరి జుడిష్యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిందితులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు భిక్షపతికి రూ.2వేలు, భాగ్యమ్మ, మహేష్‌లకు చెరో వేయి రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో ఏపీపీ సౌజన్య, విచారణ అధికారి నర్సింహారావు, సీడీఓ జి.రాజ, సమ్మన్స్ డ్యూటీ ఆఫీసర్ జి.సురేందర్ రెడ్డి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ సాయిరాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణ పరిధిలోని 7 స్టార్ హోటల్ వద్ద ఆదివారం రాత్రి సుమారు 30 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు మెరూన్ రంగు ఫుల్ టీ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రపతిని కలిసిన డ్వాబ్ బృందం


రాష్ట్రపతితో ఏఐసీబీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగోటి చొక్కారావు, ఇతర కార్యవర్గం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణానికి చెందిన డ్వాబ్ ప్రతినిధి బృందం సోమవారం ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసింది. అంధుల కోసం తీసుకువచ్చిన కొత్త చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు పర్చడంలేదని వివరించారు. అంధుల చట్టాలు, రిజర్వేషన్లు అమలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని విన్నవించారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో అఖిలభారత అంధుల సంఘాల సమాఖ్య (ఏఐసీబీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగోటి చొక్కారావు, ఏఐసీబీ కార్యవర్గ సభ్యులు రాత్లావత్ స్వామినాయక్, డి. రేణుక, ఎన్. నాగరాజు ఉన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్


యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

యాదగిరిగుట్ట: కళాకారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాకారులందరికీ విద్య, వైద్యం అందుబాటులో ఉండాలని, కళాకారులు అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి మూడు లక్షల రూపాయలు పేద కళాకారులకు వర్తింపచేయాలన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కా వెంకటేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత కళాకారులకు బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పించాలన్నారు. అర్హులైన కళాకారులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలను అసెంబ్లీ ఎన్నికలలో ఓడించాలని కళాకారులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భూషపాక నరసింహులు, పోతు ప్రవీణ్, పిట్టల శంకర్, హేమలత, సుగుణమ్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.